క్లుప్తంగా

సమగ్ర శిక్షలో పోస్టులకు నేటి నుంచి హాజరుకావాలి

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్షలో సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి మంగళ, బుధవారాల్లో హాజరుకావాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఏఎల్ఎస్సీఓ, 14న అసిస్టెంట్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఉర్దూ) పోస్టులకు హాజరుకావాలన్నారు.

19 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 19 నుంచి 28 వరకు నిర్వహించనున్నామని డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లు bse. ap. gov. inలో అందుబాటులో ఉన్నాయన్నారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009కు హాయ్ అనే మెసేజ్ పంపి హాల్ టికెట్లను పొందవచ్చని సూచించారు.

క్షయపై సమీక్ష సమావేశం

నెల్లూరు(అర్బన్): జిల్లాలో క్షయ నివారణే ధ్యేయంగా వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని క్షయ నివారణ విభాగ రాష్ట్ర నోడల్ అధికారి తహసీనా సూచించారు. క్షయ వ్యాధిపై బీవీనగర్‌లోని డేమియన్ ఫౌండేషన్ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని ఏడీఎంహెచ్ఓ, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పీఎమ్‌డీటీ, ఎమ్డీఆర్, మొండి టీబీ కేసులను పరిశీలించారు. డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్నదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని జీజీహెచ్‌లో అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కార్యక్రమాన్ని అసోసియేషన్ సభ్యుడు జయదేవ్ చేపట్టారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రాఘవేంద్రశెట్టి, పొన్నం రవిచంద్ర, నలుబోలు బలరామయ్యనాయుడు, గఫార్, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్లో ప్రక్షాళన ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో ప్రక్షాళనను కమిషనర్ నందన్ చేపట్టారు. 'ప్రక్షాళన లేక.. పాలన సాగక' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ తరుణంలో పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు. మేనేజర్, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా ఉన్న ఇనాయతుల్లాను ఇంజినీరింగ్ విభాగ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న శేఖర్‌బాబును అదే విభాగంలో ఈ – 1 సీటుకు బదిలీ చేశారు. అదే విధంగా పలువురికి స్థానచలనం కలిగించారు.

కనులపండువగా కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్ల కల్యాణోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమాలను అర్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా రాఘవేంద్రరావు, గిరిజ దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద ధర్నా నేడు



నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో గల కార్యాలయంలో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు తరలిరావాలని కోరారు. అసోసియేషన్ నేతలు చెంచురెడ్డి, పీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహస్రఘటాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి 1008 కుండల నదీజలంతో సహస్రఘటాభిషేకాన్ని మంగళవారం నిర్వహించనున్నామని ఈఓ కామేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి



అర్జీలను స్వీకరిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అర్హులకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నామని.. కార్డుల్లో మార్పులు, చేర్పులున్న వారు సంబంధిత సచివాలయాలను సంప్రదించాలని కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. వినతిపత్రాలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నూతనంగా వివాహమైన వారు రేషన్ కార్డుల దరఖాస్తు కోసం ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని సూచించారు. నివేశన స్థలాల కోసం వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కాగా మొత్తం 40 అర్జీలు అందాయని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్ఓ చైతన్య, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఈఈ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

➡ నగరపాలక సంస్థ పరిధిలో కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. 17వ డివిజన్ ఆకుతోట, బాబానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడారు. నూతన భవనాలకు సంబంధించిన అసెస్మెంట్లను పరిశీలించారు. పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది ద్వారా కొలతలేయించి పన్ను డిమాండ్ నోటీసులను తనిఖీ చేశారు. వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

➡ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ప్రోత్సహించేందుకు గానూ గృహాలకు ఒక్క రూపాయికే కనెక్షన్‌ను అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవాబుపేటలో భూగర్భ డ్రైనేజీ నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చామని, ట్రయల్ రన్ అనంతరం గృహాలకు అనుసంధానం చేసేలా ప్రణాళికలను రూపొందించామని వివరించారు. పాత మున్సిపల్ కార్యాలయం, వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డి కాలనీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్లను సద్వినియోగం చేసుకొని రూ.రెండుకే 20 లీటర్ల తాగునీటిని పొందాలని కోరారు.

సీహెచ్‌ఓల నిరసన ర్యాలీ



నెల్లూరు (అర్బన్): అంతర్జాతీయ నర్సుల దినోత్సవానికి ఆద్యురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ ఫ్లెక్సీతో ఆమెను స్మరించుకుంటూ నిరసన ర్యాలీని సీహెచ్‌ఓలు సోమవారం నిర్వహించారు. సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. తమ సమస్యలు పరిష్కరించేలా ఈ మొండి ప్రభుత్వానికి చెప్పాలంటూ గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ నాడు ఫ్లోరెన్స్ నైటింగేల్ ఎలా సేవలందించారో.. ఇప్పుడు తామూ అదే తరహాలో సేవలందిస్తున్నామని తెలియజేస్తూ కలెక్టరేట్ వద్ద స్కిట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్ మాట్లాడారు. సేవకు ప్రతిరూపమైన మదర్ ఆఫ్ నర్సింగ్ ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 15 రోజులుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్నామన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. అనంతరం యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. తమ సమస్యలపై కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, ప్రధాన కార్యదర్శి రుబికా, నేతలు సుమాంజలి, మహబూబ్‌జాన్, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 28వ డివిజన్లో పారిశుధ్య పనులను ఎంహెచ్ఓ చైతన్య సోమవారం పరిశీలించారు. స్థానిక సచివాలయంలో హాజరుపట్టికలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్లో 16 బ్లాక్ స్పాట్లు ఉండగా, అందులో ఎనిమిదింటిని గ్రీన్ స్పాట్లుగా మార్చామని, మిగిలిన వాటిపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం పక్కనే ఉన్న కొరియర్ గోడౌన్‌ను పరిశీలించారు. ట్రేడ్ లైసెన్స్ లేకపోవడాన్ని గుర్తించిన ఆయన వెంటనే పొందాలని ఆదేశించారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌లో పరిశీలన



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని ఈఎస్ఆర్ఎం హైస్కూల్లో గల విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య సోమవారం పరిశీలించారు. విద్యార్థి మిత్రకు సంబంధించి ఇప్పటికే వచ్చిన సామగ్రిని ఆయా మండల కేంద్రాలకు పంపామని తెలిపారు. ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను వ్యాపారులు పాటించాలి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

నెల్లూరు(అర్బన్): తూనికలు, కొలతల శాఖ రూపొందించిన నిబంధనలను వ్యాపారులు తప్పక పాటించాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలో కిరాణా, హోల్‌సేల్ వ్యాపారులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తేదీ, ఎమ్మార్పీ, నికర బరువు, తయారిదారీ వివరాలను వస్తువులపై ప్రదర్శించాలని సూచించారు. వాసవి కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచికంటి శ్రీనివాసులు, సింహపురి వాణిజ్య మండలి కార్యదర్శి వెలుగొండయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు



నెల్లూరు సిటీ: ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచలనరసయ్య పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, నేతలు అబ్దుల్ అజీజ్, సుధాకర్, సంపత్‌కుమార్, రంగయ్య, ఖాజావలీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని సోమవారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. మఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసరావు దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

వేదగిరిలో నేత్రపర్వంగా కల్యాణం



నెల్లూరు సిటీ: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. బంగారు గరుడసేవ, గజవాహనసేవను జరిపారు. ఈఓ గోపీ, ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదల రంగానికి తొలి ప్రాధాన్యమివ్వాలి

నెల్లూరు రూరల్: నీటిపారుదల రంగానికి తొలి ప్రాధాన్యమివ్వాలని, కేంద్ర ప్రభుత్వమిచ్చిన నిధులను దారి మళ్లించడం ద్వారా ప్రాజెక్టులు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయని బీజేపీ నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరు జలవనరుల శాఖ సెంట్రల్ డివిజన్ డీఈ అనిల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. శిరీష, ప్రభాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పొదలకూరు రోడ్డు విస్తరణ దృష్ట్యా, స్తంభాలను మార్చనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేన్సర్ హాస్పిటల్, జెడ్పీ కాలనీ, సారాయంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీనగర్, గౌతమినగర్, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ ఉస్మాన్‌సాహెబ్‌పేటలో రథోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో రేబాలవారివీధి, తడికలబజార్, ఉస్మాన్‌సాహెబ్‌పేట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఈఈ శ్రీధర్ పేర్కొన్నారు.

పంటను లాక్కొని దౌర్జన్యం చేస్తున్నారు

నెల్లూరు రూరల్: చేతికొచ్చిన పంటను దౌర్జన్యంగా లాక్కొని తమను బెదిరిస్తున్నారని జలదంకి మండలం చోడవరానికి చెందిన కోటయ్య కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన నాగేశ్వరరావు వచ్చి తనను నానా దుర్భాషలాడి వడ్లను లాక్కున్నారని వాపోయారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని, తనకు న్యాయం చేయాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. దాతగా కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ సాహెబ్‌పీర్ వ్యవహరించారు. సైకాలజిస్ట్ డాక్టర్ శింగంశెట్టి అభిషేక్, అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యనారాయణ, సెక్రటరీ స్నేహ సురేష్, కనకట్ల రఘురామ్ ముదిరాజ్, వేలూరు రంగారావు, దద్దోలు రమణయ్య, నలుబోలు బలరామయ్య, అనంత రామారావు, బాసం శేషగిరిరావు, మెంటా రామారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని పలు జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న పలువురికి ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఉత్తర్వులను డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కృతికా శుక్లా జారీ చేశారు. పదోన్నతి పొందిన అధ్యాపకులు వెంటనే రిలీవై ఆయా కళాశాలల్లో ప్రిన్సిపల్స్‌గా బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న రమణారెడ్డిని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. కేఏసీ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు జయమాలతిని టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు కృష్ణవేణిని రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావును ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. పీవీపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు లక్ష్మీజ్ఞానేశ్వరిని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు కరుణకుమారిని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పదోన్నతి కల్పించారు.

డయల్ యువర్ డీఎం - 1 నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం – 1ను మంగళవారం నిర్వహించనున్నామని మేనేజర్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25641 నంబర్‌కు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు ఫోన్ చేసి సూచనలు, సలహాలను అందజేయాలని కోరారు.

అయ్యప్పగుడి సెంటర్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. అయ్యప్పగుడి సెంటర్‌లో నివాసం ఉంటున్న గోవిందమ్మ తన ఇంట్లోనే చిల్లర దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె తన ఇంటికి తాళం వేసి తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం సింగనాలటూరులోని కుమార్తె ఇంటికి ఆదివారం వెళ్లారు. ఈ తరుణంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపు గొళ్లేన్ని పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.78 వేలు, మూడు సవర్ల బంగారు గొలుసును అపహరించుకెళ్లారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన పక్కింటి వారు.. బాధితురాలికి ఫోన్ చేసి సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న ఆమె చోరీ విషయాన్ని నిర్ధారించుకొని వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 450కుపైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని నెల్లూరు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం, గౌడ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్, కార్యనిర్వహణాధ్యక్షుడు కోసూరు రాజశేఖర్ తెలిపారు. సుజాతమ్మ కాలనీలో విలేకరులతో సోమవారం వారు మాట్లాడారు. రూ.ఐదు వేల నగదు ప్రోత్సాహకంతో పాటు విద్యాసామగ్రిని అందజేయనున్నామని వివరించారు. దరఖాస్తులను కోసూరు రాజశేఖర్‌గౌడ్, డోర్ నంబర్ 24 – 3 – 390, సుజాతమ్మ కాలనీ, మూడో వీధి, దర్గామిట్ట, నెల్లూరు చిరునామాకు జూన్ 15లోపు పంపాలని కోరారు. ముత్యం గౌడ్, ఉప్పాల రామకృష్ణ, తాతా రమణయ్య, ఆలపాక శ్రీనివాసులు, మోర్ల వెంకటేశ్వర్లు, ఆలపాక రవి, తాతా సుబ్బారావు, నిమ్మల సుబ్బయ్య, ఉప్పాల యల్లయ్య, కోసూరు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టుల అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న హాకీ శిబిరంలో శిక్షణ పొందుతున్న వారికి టీ షర్టులను కోచ్ చందు, క్రీడాకారుడు భానుప్రకాష్ సోమవారం అందజేశారు. క్రీడాకారులు, అఖిల్, ఆది, హరీష్, లోకేష్, ఆకాష్, హితేష్, హమీద్, హఫీజ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఏర్పాటు



నెల్లూరు రూరల్: జాతీయ సమాచార హక్కు చట్టం ప్రొటెక్షన్ ఫోర్స్ కమిషన్‌కు సంబంధించిన వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని సంస్థ జాతీయ అధ్యక్షుడు జిలానీబాషా తెలిపారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మురారి మధును నియమించామన్నారు. అనంతరం నియామక పత్రంతో పాటు గుర్తింపు కార్డులను అందజేశారు.

డీఈఓ కార్యాలయ ఎదుట యూటీఎఫ్ ధర్నా



మాట్లాడుతున్న నవకోటేశ్వరరావు

నెల్లూరు (టౌన్): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 పద్ధతిన ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని వివరించారు. హైస్కూళ్లలో 300 మంది విద్యార్థులు మించితే రెండో పీడీ పోస్టును కేటాయించాలని పేర్కొన్నారు. ప్లస్ టూ స్కూళ్లలో ఖాళీగా ఉన్న పీటీటీ, స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేశాకే బదిలీలను జరపాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టి వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, నేతలు వెంకటేశ్వర్లు, సుభాషిణి, మురళీధర్‌రావు, నాగిరెడ్డి, ఖాజావలీ, శ్రావణ్‌కుమార్, గంగాధర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి



నెల్లూరు(బృందావనం): బుద్ధ పూర్ణిమను పురస్కరించుకొని గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో గౌతమబుద్ధుడి విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. సామాజిక సమరసత వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ముప్పిరాల సుబ్రహ్మణ్యం, నిర్వాహకులు పోలయ్య, మోవిడి శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి, కృష్ణమూర్తి, రాధాకృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైంది



నెల్లూరు(అర్బన్): రోగులకు నిస్వార్థంగా సేవ చేసే నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో నర్సులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రోగుల ప్రాణాలను కాపాడటంలో వీరి పాత్ర ఎనలేనిదని చెప్పారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు అబీదాబేగం, మల్లికార్జున, సతీష్, హెడ్ నర్సులు వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞాన పెంపుతో రాణించొచ్చు



మాట్లాడుతున్న లక్ష్మణరావు

నెల్లూరు(అర్బన్): ఇష్టపడి చదువుతూ.. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా డీఎస్సీ పరీక్షల్లో విజేతలుగా రాణించగలరని మాజీ ఎమ్మెల్సీ, పోటీ పరీక్షల నిపుణుడు లక్ష్మణరావు పేర్కొన్నారు. హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్ర ట్రస్ట్ కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సును ట్రస్ట్, యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లక్ష్మణరావు రూపొందించిన విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియళ్లను ఆవిష్కరించారు. వివిధ అంశాలను అధ్యాపకుడు ఆర్వీ నాయుడు, డాక్టర్ నళిని, స్ఫూర్తి వెంకటేశ్వర్లు, వెంకట్రావు, రత్నశేఖర్, శ్రీనివాసులు వివరించారు. అనంతరం మెటీరియళ్లను పంపిణీ చేశారు. డీఎస్సీ అభ్యర్థుల కోసం గ్రాండ్ టెస్ట్‌ను జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించనున్నామని లక్ష్మణరావు తెలిపారు. పరీక్ష ఫీజు రూ.20 అని, 94408 93123 నంబర్‌కు ఫోన్ పే చేసి అభ్యర్థి పేరు, మొబైల్ నంబర్, సబ్జెక్ట్ వివరాలను వాట్సాప్‌కు పంపాలని కోరారు. ట్రస్ట్ కార్యదర్శి చంద్ర రాజగోపాల్, యూటీఎఫ్ నేతలు చలపతి, కామయ్య, శ్రీహరి, ట్రస్ట్ బాధ్యుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీని నిర్మూలిద్దాం



నెల్లూరు(అర్బన్): జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ సుజాత సూచించారు. హెచ్‌ఐవీపై అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు గానూ కళాజాతాను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సారథ్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎయిడ్స్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, మారుమూల పల్లెల్లో ప్రజలను చైతన్యం చేస్తూ నాటికలు, పాటలు, కళారూపాలతో పది రోజుల పాటు కార్యక్రమాలను కళాజాత బృందాలు నిర్వహించనున్నాయని చెప్పారు.